రెండు నామినేషన్ల తిరస్కరణ

రాజన్న సిరిసిల్ల, మే 30 (నమస్తే తెలంగాణ): అర్బన్ బ్యాంకు నామినేషన్ల పరిశీలన గురువారం పూర్తయ్యింది. 12 డివిజన్లకు 105మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రాత్రి వరకు పరిశీలించిన ఎన్నికల అధికారులు ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. 11వ డివిజన్ నుంచి సిట్టింగ్ డైరెక్టర్ అడిశర్ల సాయికృష్ణ బ్యాంకు నుంచి రుణం తీసుకున్న వ్యక్తికి జమానతు పడ్డాడు. రుణం తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించకపోవడంతో అతడి నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే 4వ డివిజన్ నుంచి వడ్లకొండ మధు బ్యాంకు సీఈవోకు దగ్గర బంధువు కావడంతో సహకార చట్టం ప్రకారం అతడి నామినేషన్ తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ తెలిపారు. 105 మంది నామినేషన్లలో ఇద్దరి నామినేషన్లు తిరస్కరించగా, 103మంది నామినేషన్లు నిబంధనలకు లోబడి ఉన్నందున వాటిని అనుమతించారు. ఉపసంహరణ పక్రియతో బరిలో ఎంత మంది ఉంటారన్నది నేడు తేలనున్నది.

రాజన్న సన్నిధిలో భద్రాచలం ఈవో

వేములవాడ టౌన్, మే 30: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని గురువారం భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకొని, ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఇక్కడ పర్యవేక్షకులు, తదితరులు ఉన్నారు.

షష్టిపూర్తి ఉత్సవాలు

ఇల్లంతకుంట, మే 30: మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో గురువారం నుంచి వారంపాటు షష్టిపూర్తి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని ఆలయ అర్చకుడు మూగు నాగరాజుశర్మ తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ వేడుకకు హాజరుకాగా, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పర్మిషన్లు ఓ చోట.. ఇసుక పోసేది మరోచోట

ముస్తాబాద్, మే 30: ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉన్న మానేర్ వాగు నుంచి మండలంలోని సొంత భవన నిర్మాణ, ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక తరలించడానికి పర్మిషన్లు ఇస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ముస్తాబాద్ ఎంపీటీసీ శ్రీనివాస్ ఆరోపించారు. ఇసుకకు పర్మిషన్ ఓ చోట తీసుకుని.. మరో చోట పోస్తున్నారని.. ఈ మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆయన తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

అందుబాటులో విత్తనాలు

బోయినపల్లి, మే 30: రైతులకు సరిపడా పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో ప్రణీత తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల, విత్తనాల దుకణాలను ఆమె తనిఖీ చేసి, మాట్లాడారు. ఈ సీజన్ 6,500 ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉన్నదని తెలిపారు. డీలర్ల వద్ద విత్తనాల ప్యాకెట్లు ఉన్నాయని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

కంపెనీ ఉద్యోగితో కలిసి కంకర మాయం

ఎల్లారెడ్డిపేట, మే30: ఇటీవల అక్కపల్లి శివారులో కాళేశ్వరం ప్రాజెక్టు కింద కాలువ నిర్మాణం కోసం డంప్ చేసిన కంకర మాయమైనట్లు ఘటనలో కొత్త కోణం వెలుగు చూసింది. లలితా ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ కాళేశ్వరం కాలువ నిర్మాణం కోసం రూ.6.50లక్షల విలువైన 25ట్రిప్పర్ల కంకరను కాలువ పక్కన డంప్ చేసింది. అనివార్య కారణాలతో కాల్వ నిర్మాణ పనులు ఆలస్యమ య్యాయి. ఈ క్రమంలో కొందరు కంకర డంప్‌పై కన్నేశారు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ ఉద్యోగి గ్రామంలో ఒకరిద్దరితో బేరమాడి కంకర విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. దీంతో కంకర డంప్‌ను వాహనాల్లో నింపేందుకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్ యజమాని, ట్రాక్టర్‌తో తీసుకెళ్లిన మరో వ్యక్తికి కంపెనీ ఇంజినీర్ ఫోన్ చేశాడు. సదరు కంపెనీ ఉద్యోగికి డబ్బులిచ్చి కంకరను తీసుకెళ్తున్నా మని వారు చెప్పడంతో ఇంజినీర్ కంగుతిన్నాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సదరు ఇంజినీర్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- వ్యాయామం, యోగా దినచర్యలో భాగం చేసుకోవాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్ • జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సిబ్బందికి వైద్య పరీక్షలు

సిరిసిల్ల రూరల్: శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల రూరల్, మే 30: ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఈ క్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్యం ఆరోగ్యంగా ఉండేలా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం తాడూరు శివారులోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ ప్రత్యేక చొరవతో సిరిసిల్లలోని తారకరామ, లక్ష్మీనరసింహ దవాఖానల ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, పోలీస్ సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, నిత్యం అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఒత్తిడిలో పనిచేసే సిబ్బంది కోసం ఉచితంగా వైద్య శిబిరాలు, యోగా, క్రీడలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నడక, వ్యాయామం, యోగా దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రాచారి, మురళీకృష్ణ, సీఐలు రఘుపతి, అనిల్‌కుమార్, శ్రీనివాస్, ఆర్ఐలు యాదగిరి, రమేశ్, వైద్యులు మహేశ్, నరేశ్‌కుమార్, రీనా శర్మిలి, సూర్య, అరవింద్, లక్ష్మణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

చందుర్తి, మే 30: బాధితుల ఫిర్యాదులపై జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. గురువారం ఆయన చందుర్తి పోలీస్ స్టేషన్ పరిసరాలు, పీఎస్‌లోని రికార్డులు, రిసెప్షన్, జీడీ ఎంట్రీ లాకప్ రూమ్‌లను పరిశీలించి, మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనాలు జరుగకుండా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపై యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇక్కడ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

గాయపడిన స్నేహిత్‌ను పరామర్శిస్తున్న కొండూరి రవీందర్‌రావు

కొండూరి రవీందర్‌రావు పరామర్శ

గంభీరావుపేట, మే 30: గోరంటాల గ్రామానికి చెందిన చిక్కుడు స్నేహిత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, గురువారం ఆయనను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్నేహిత్‌కు వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, కొలుముల బాల్‌రెడ్డి, భాషనవేని సురేందర్, తదితరులు ఉన్నారు.

జిల్లెల్లలో 'బలగం' డైరెక్టర్ వేణు

ఆలయ ఆవరణలో బలగం డైరెక్టర్ వేణు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 30: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని గరిపెల్లి ఆంజనేయస్వామి ఆలయంలో బలగం సినిమా డైరెక్టర్ యెల్దండి వేణు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బలగం సినిమా షూటింగ్ ను ఈ ఆలయంలో క్లాప్ కొట్టి షూటింగ్ మొదలుపెట్టినట్లు తెలిపారు. షూటింగ్‌కు గ్రామ ప్రజలు సహకరించారని చెప్పారు. అనంతరం ఆయన గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట బీఆర్ఎస్ యూత్ నాయకులు ఉడుతల తిరుపతి, బొడ్డు శ్రీధర్, రాజుగౌడ్, పృథ్వీ, పరశురాం, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు

కోనరావుపేట జట్టుతో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి, మే 30: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. మల్యాలలో క్రికెట్ ప్రీమియం లీగ్ సీజన్-1 ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించిందన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం విజేత జట్టు కోనరావుపేటకు ప్రైజ్ మనీగా ₹20వేలతోపాటు కప్, రన్నరప్ మల్యాల జట్టుకు ₹10వేల ప్రైజ్‌మనీ అందించారు. ప్రోత్సాహక బహుమతులు అందించిన ఈర్లపల్లి రాజును, గట్టు లక్ష్మీనారాయణను చల్మెడ అభినందించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, వైస్ ఎంపీపీ అబ్రహం, ఎంపీటీసీ రమేశ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు రమేశ్, శ్రీనివాస్, కమలాకర్, రవి, కౌన్సిలర్ సిరిగిరి రామ్‌చందర్, నాయకులు, తదితరులు ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

కోనరావుపేట, మే 30: కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు బాగులేకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోనరావుపేటలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన కొలకాని నవీన్(19) ఇంటర్ ఫస్టియర్ చదివి ఇంటివద్దనే ఉంటున్నాడు. నవీన్ తల్లి సరళవ్వ మానసికస్థితి బాగా లేకపోవడంతో తండ్రి కాశయ్య మరో పెండ్లి చేసుకున్నాడు. దీంతో నానమ్మ ఎల్లవ్వ-తాత ముత్తయ్యతో కలిసి నవీన్ ఉంటున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితితోపాటు తాను అనారోగ్యం బారినపడడంతో నవీన్ మనోవేదన చెందాడు. బుధవారం అందరూ నిద్రించిన తర్వాత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

గూడెంలో వృద్ధుడు..

ముస్తాబాద్, మే 30: గూడెం గ్రామానికి చెందిన బెదిరె రాజయ్య(80)కు వయసు పైబడడం.. అలాగే భార్య బాలవ్వ అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన నియామకం

సిరిసిల్ల రూరల్, మే 30: నేషనల్ హ్యూమన్ రైట్స్, జస్టిస్ మూవ్‌మెంట్ జిల్లా ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీగా మహేశ్‌రాయనర్సు నియామకయ్యారు. ఈమేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు ఎండీ హమీద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు మహ్మద్ అర్షద్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు హమీద్, జాతీయ చీఫ్ సెక్రటరీ షబ్బీర్‌అలీ మదానికి రాయనర్సు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఏస్తేరమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వినోద్‌కుమార్, నేతలు

ఇల్లంతకుంట, మే 30: ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అత్త ఎరవెల్లి ఏస్తేరమ్మ గురువారం మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఏస్తేరమ్మ భౌతికకాయానిన సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్‌గౌడ్ ఉన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేదు

- నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి

ముస్తాబాద్: తుర్కపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో ప్రదీప్

కలెక్టరేట్, మే30: వానకాలం సాగు కోసం జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత లేదని కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, పత్తి ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీ విత్తనాలు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, ఆందోళనకు గురికావద్దని సూచించారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్త

ముస్తాబాద్, మే 30: విత్తనాలు కొనుగోలుచేసే క్రమంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఈవోలు ప్రదీప్, సౌమ్య సూచించారు. తుర్కపల్లి, సేవాలాల్‌తండా గ్రామాల్లో గురువారం విత్తనాల ఎంపికపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేకుండా చూస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని

ఇల్లంతకుంట, మే 30: రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఏఈవోలు అర్చన, రవళి సూచించారు. వల్లంపట్ల, రేపాక గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న ప్రాంతానికి గురువారం వారు వెళ్లారు. ఈ సందర్భంగా వానకాలం సాగులో విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలను తడి గుడ్డలో గానీ తడిసిన ఇసుకలో గానీ పెట్టి నాణ్యతను పరిశీలించుకోవచ్చని ఏఈవోలు సూచించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ టౌన్, మే 30: పెద్ద హనుమాన్‌జయంతిని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్‌దీక్షాపరులు భీమేశ్వరాలయం నుంచి పురవీధుల గుండా శోభాయత్ర చేపట్టారు. జై హనుమాన్, జైజై హనుమాన్.. భగవన్నామ స్మరణతో యాత్ర సాగింది. శోభాయాత్రలో ఓ భక్తుడు హనుమంతుడి వేషధారణతో పలువురిని ఆకట్టుకున్నాడు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, అల్లాడి రమేశ్, చిలుక రమేశ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం ₹కోటీ53లక్షలు

- 28రోజుల్లోనే సమకూరిన నగదు

హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది, సేవా సమితి సభ్యులు

వేములవాడ టౌన్, మే 30: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి హుండీ ఆదాయం ₹కోటీ53లక్షల48వేల267 సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రామకృష్ణ వెల్లడించారు. గురువారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించిన హుండీ లెక్కింపులో 157.3 గ్రాముల బంగారం, 12.5కిలోల వెండి సమకూరినట్లు తెలిపారు. ఈ ఆదాయం కేవలం 28 రోజులది మాత్రమేనని ఆయన వెల్లడించారు. ఇక్కడ ఏఈవోలు, పర్యవేక్షకులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, భ్రమరాంబికా సేవా సమితి సభ్యులు ఉన్నారు.

వ్యాన్, లారీ ఢీకొని..

- వ్యాన్ డ్రైవర్ మృతి

వేములవాడ రూరల్, మే 30: వ్యాన్, లారీ ఢీకొనగా వ్యాన్ డ్రైవర్ మృతి చెందిన ఘటన వేములవాడ పట్టణ పరిధిలోని నాంపెల్లి మూలమలుపు వద్ద చోటుచేసుకున్నది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన తాటిపెల్లి బాపురెడ్డి(63) వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం కరీంనగర్ నుంచి సిరిసిల్ల వైపు వ్యాన్‌పై వస్తుండగా, నాంపెల్లి మూలమలుపు వద్ద లారీ ఢీకొనడంతో వ్యాన్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు, 108సిబ్బంది బాపురెడ్డిని వ్యాన్‌లో నుంచి బయటికి తీశారు. అంబులెన్స్‌లో సిరిసిల్ల దవాఖానకు తరలిస్తుండగా, మృతిచెందాడు. స్వల్పంగా గాయపడిన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. బాపురెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ కాగా, ఎస్ఐ అంజయ్య అక్కడి చేరుకొని క్లియర్ చేశారు.

గడువులోగా యూనిఫామ్స్ అందించాలి

ఇల్లంతకుంట, మే 30: పాఠశాలలు పునర్‌ప్రారంభమయ్యేలోగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి పేర్కొన్నారు. గురువారం ఆయన కందికట్కూర్, గాలిపెల్లి గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు కుడుతున్న స్కూల్ యూనిఫామ్స్ కుట్టు కేంద్రాలను పరిశీలించారు. ఇక్కడ అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం సుధారాణి, ఏపీఎంలు శ్రీనివాస్, వాణిశ్రీ, సీసీలు వెంటేశం, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

కలెక్టరేట్: సీఐటీయూ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడ/కలెక్టరేట్/కోనరావుపేట,మే 30: సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు జెండాను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందుల మల్లేశ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ సినారుద్దీన్, నాయకులు హాజరయ్యారు. అలాగే జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో గల సీఐటీయూ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఇక్కడ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా ఆఫీస్ బేరర్ గుర్రం అశోక్, తదితరులు ఉన్నారు. అలాగే కోనరావుపేట మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్వర్యంలో సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ హక్కులు సాధించుకుందామని ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ఫర్టిలైజర్, సీడ్స్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస, ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల రూరల్, మే 30: రైతులకు నాణ్యమైన విత్తనాలు, మందులు విక్రయించాలని ఎంపీపీ పడిగెల మానస సూచించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ చౌరస్తాలో అం కుసాపూర్ గ్రామానికి చెందిన సావనపల్లి వెంకటేశ్ ఏర్పాటు చేసి శ్రీనివాస ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాన్ని సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్యతో కలిసి ప్రారంభించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు పడిగెల రాజు, కుర్మ రాజయ్య, సావనపల్లి బాలయ్య, భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో నరేశ్ ఉన్నారు.

దుర్భర జీవితాలు..అందని వేతనాలు

- పారిశుధ్య కార్మికులకు తప్పని అవస్థలు

పారిశుధ్య పనులు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్

ఎల్లారెడ్డిపేట, మే30: కోడికూయక ముందే కోటి ఇబ్బందులున్నా.. ఆరోగ్యం క్షీణించినా ఊరును పరిశుభ్రంగా ఉంచి అందరి ఆరోగ్యం కాపాడే పారిశుధ్య కార్మికుల జీవితాలు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. నెలల తరబడి పని చేస్తున్నా.. జీతాలెప్పుడొస్తాయంటూ కార్యదర్శులను వేడుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 200మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని సదరు కుటుంబాల దీనస్థితిని చూస్తున్న కొంత మంది కార్యదర్శులు అప్పులు తెచ్చి, సొంత జీతాల్లోంచి వేతనాలు చెల్లిస్తున్న ఉదంతాలూ ఉన్నాయి. ఎమర్జెన్సీ విధులను అనారోగ్య పరిస్థితులను తట్టుకుని చేస్తున్నప్పటికీ వేతనాలు అందకపోవడంతో అప్పుతెచ్చి కిరాణా సామగ్రి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని గోడు వెల్లబోసుకుంటున్నారు. ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ మల్టీపర్పస్ వర్కర్‌లు మాత్రం నాలుగు నుంచి ఐదు నెలల జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో సత్తయ్యను వివరణ కోరగా, చిన్న అమౌంట్ ఉన్న గ్రామ పంచాయతీలకు క్లియర్ అవుతున్నాయని, పెద్ద పంచాయతీల బిల్లుల విషయంలో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని, త్వరలోనే వారి బిల్లులు క్లియర్ అవుతాయని చెప్పారు.

జీతాలు రాక ఇబ్బందులు

జీతం నెలనెలా రాకపోవడంతో చాన ఇబ్బందైతాంది. అప్పుతెచ్చి దుకాన్ల సామను కొనుక్కచ్చి పూట గడుపుతున్నం. మా అసోంటి సిన్న జీతం ఉన్నోళ్లకు పైసలివ్వకపోతే బతుకు డెట్ల. ఏ సార్‌ను అడిగినా మమ్ముల్ని పట్టించుకుంటలేరు. జీతమిచ్చి మమ్మల్ని ఆదుకోవాలె.

– దండి బాలయ్య, పారిశుధ్య కార్మికుడు (ఎల్లారెడ్డిపేట)

సాహిత్యంపై ఆసక్తి కలిగి ఉండాలి

వేములవాడ టౌన్, మే 30: ప్రతి ఒక్కరూ సాహిత్యంపై ఆసక్తి కలిగి ఉండాలని సంస్కృత విశ్లేషకుడు తిరునగరి లక్ష్మణస్వామి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వీరగోని హనుమమ్మ బసవయ్య పౌర గ్రంథాలయంలో 'సంస్కృత సాహిత్యంలో సమాజహితం' అంశంపై విశ్లేషణ నిర్వహించారు. కార్యక్రమానికి లక్ష్మణస్వామి హాజరై మాట్లాడారు. సాహిత్యంపై ఆసక్తి కలిగి ఉన్నప్పుడే సమాజ హితం బోధపడుతుందన్నారు. సంస్కృతంలో సమాజ హితం అనంత మన్నారు. మానవ సృష్టికి భగవత్ సృష్టికి మధ్య ఉన్న తేడాను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు వీరగోని ఆంజనేయులు, అల్లాడి చంద్రశేఖర్, వీరగోని చైతన్య, సుంకపాక దామోదర్, పరశురాములు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, వక్తలు, సాహితీ వేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు అందజేత

కోనరావుపేట, మే 30: పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థినులు నందగిరి దీప్తి, పల్లి రిత్విరకకు గురువారం నిజామాబాద్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గౌడ సంఘం నేతలు ప్రోత్సాహకాన్ని అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఇక్కడ అబ్బసాని శంకర్‌గౌడ్, తీగల రవీందర్‌గౌడ్, నందగిరి తిరుపతి, వెంగలి వెంకన్న, తాళ్లపల్లి తిరుపతి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పోచమ్మకు ఘనంగా బోనాలు

రుద్రంగి, మే 30: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ మున్నూరుకాపు సంఘం, శ్రీ రాజరాజేశ్వర మున్నూరుకాపు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో మహిళలు గురువారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో మహిళలు